


విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరసనలు

భీమవరం :విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరసనలు చేపట్టాలని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియనన్స్ స్ట్రగుల్ కమిటీ పిలుపునిచ్చింది. స్ట్రగుల్ కమిటీ జెఎసి జిల్లా గౌరవాధ్యక్షులు కె.రాజా రామ్మోహన్‌రాయ్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ జె.శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సురేష్, భీమవరం డివిజన్ అధ్యక్షులు వి.సుభాష్ చంద్రబోస్ ప్రకటన విడుదలచేశారు. కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేసుకుని నేరుగా వేతనాలు చెల్లించడానికి అభ్యంతరాలు ఏంటని ప్రశ్నించారు. జెఎల్‌ఎం గ్రేడ్ 2లకు ఎపి ఎస్ఇబి సర్వీస్ రెగ్యులేషన్స్ అమలు చేయడానికి అడ్డంకులేంటని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులకు పెండింగ్ డిఎలను మంజూరులో అలసత్వం అన్యాయమని తెలిపారు. 15న జరగాల్సిన సమ్మె వాయిదా పడడంతో 17 మధ్యాహ్నం 3 గంటల నుండి విద్యుత్ సౌధాలో పవర్ జెఎసితో చర్చలు జరగనున్నట్లు తెలిపారు. 17 మధ్యాహ్నం 2 గంటలకు అన్ని జిల్లాల్లో ఎస్ఇ కార్యాలయాల ఎదుట ధర్నా, బైఠాయింపు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

అందరి ఆశీర్వాదం వల్లే డిజిపి స్థాయికి చేరా

కేరళ డిజిపి రావాడ ఆజాద్ చంద్రశేఖర్ - ఘనంగా పౌర సన్మానం



కేరళ డిజిపి ఆజాద్ చంద్రశేఖర్, సరిత దంపతులకు పౌరసన్మానం చేస్తున్న గ్రామస్తులు



మాట్లాడుతున్న డిజిపి ఆజాద్ చంద్రశేఖర్



విద్యార్థినికి ప్రోత్సాహకం అందజేస్తున్న డిజిపి, కలెక్టర్



గురువులను సత్కరించి ఆశీర్వాదం తీసుకుంటున్న డిజిపి ఆజాద్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న జడ్జి వీరవల్లి గోపాలకృష్ణ

ప్రజాశక్తి - వీరవాసరం

'నా గ్రామస్తులు, నా గురువుల ఆశీస్సులు, నా తల్లిదండ్రుల త్యాగఫలం, నా సోదరుల సహకారం, నా స్నేహితుల ప్రేమ వల్లే నేను డిజిపి స్థాయికి ఎదిగాను' అని వీరవాసరం వాసి, ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వపు విద్యార్థి, ప్రస్తుత కేరళ డిజిపి రావాడ ఆజాద్ చంద్రశేఖర్ తెలిపారు. కేరళ డిజిపి ఆజాద్ చంద్రశేఖర్, సరిత దంపతులను గ్రామస్తుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా పౌర సన్మానం చేశారు. ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆజాద్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వీరవాసరం గ్రామం గొప్పతనం చెప్పాలంటే 1981లో పదో తరగతి, 1983లో ఇంటర్ చదువుకున్న ముగ్గురు విద్యార్థుల్లో తనతోపాటు ఎంవి.సుబ్బారెడ్డి, చికిలే సుభాకర్ ఆలిండియా సర్వీస్‌కు ఎంపికయ్యామని తెలిపారు. సుబ్బారెడ్డికి త్రిపుర, సుభాకర్ సిక్కిం, తాను కేరళకు వెళ్లామని వివరించారు. ఆనాడు తాము వేర్వేరు ప్రాంతాలకు వెళ్లడం బాధ అన్పించినా వీరవాసరం ఖ్యాతిని దేశం నలుమూలలా వ్యాపింపజేశామని సంతృప్తి దక్కిందన్నారు. పదవులకు ప్రాధాన్యత ఇవ్వకుండా మంచి వ్యక్తిత్వం, సేవాగుణంతో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ప్రతిఒక్కరికీ ఉన్నదే ఒకే సమయమని, దీన్ని సద్వినియోగం చేసుకుని మనం అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి కష్టపడడమే ఆలోచనగా ముందుకు సాగాలని తెలిపారు. ఫిజికల్ ఎనర్జీ, మెంటల్ స్పిరిట్యువల్ ఎనర్జీని అర్థం చేసుకుని ఉన్న సమయాన్ని సక్రమంగా వినియోగించుకుంటే అనుకున్నది తప్పనిసరిగా సాధించుకోగలుగుతామన్నారు. నేటి యువతకు, విద్యార్థులకు, తాను చెప్పేది ఒకటే అని, తాను విద్యార్థి దశలో ఒక సాధారణ విద్యార్థినని, అంత తెలివితేటలు లేవని తెలిపారు. అయితే నిరంతర శ్రమతోనే తాను ఈ స్థాయిలో మీ ముందున్నానన్నారు. ప్రతిఒక్కరూ కృతజ్ఞతతో ఉండాలని, అనవసర విషయాలు వదిలేయాలని అన్నారు. ఈ సమాజానికి ఎలా ఉపయోగపడాలనే ఆలోచనతో మెలగాలన్నారు. ఏఒక్కరూ మరొకరితో పోల్చుకోకూడదని సూచించారు. గురువులు చెప్పిది చదువుకుంటూ, తన తండ్రి చెప్పిన మాటలకు అనుగుణంగా తన కృషి వల్లే తాను ఈ సర్వీసులో ఉన్నానని చెప్పారు. పోలీస్ సర్వీస్‌లో ఉండటమే కాదని, అందులోని లోటుపాట్లను సరి చేసుకుంటూ ఒక టీమ్‌గా అందరినీ ముందుకు తీసుకెళ్లడంలో తాను విజయం సాధించానని చెప్పారు. ఈ సర్వీస్‌లో చేరిన నాటి నుండి తన తల్లి తనతోపాటే ఉండడం తనకు అత్యంత ఆనందకరమైన అంశమన్నారు. ప్రజలకు నమ్మకం కలిగించే బాధ్యతగా పోలీస్ ఉండాలన్నారు. కేరళ రాజకీయంగా, సాంస్కృతికంగా, సంఘ పరంగా బాగా చైతన్యం ఉన్న రాష్ట్రమని, అక్కడ పోలీస్‌గా ఉండటమంటే ఒక ఛాలెంజ్ అని తెలిపారు. ఆ పోలీస్‌గానే పారదర్శకంగా, మానవీయంగా, ప్రజల పక్షం ఉండే విధంగా ఉన్నానని, అందుకు అనుగుణంగానే అక్కడ పని చేస్తున్నానని తెలిపారు. తాను ఎంత దూరంలో ఉన్నా ప్రతి విషయంలోనూ మన గ్రామ గుండె చప్పుడు ప్రతి క్షణం తనతోపాటు ఉంటుందన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిన ఎంఆర్‌కె హైస్కూల్ నేడు ఒక వటవృక్షంలా ఎదిగిందన్నారు. విద్యాదాత మద్దాల రామకృష్ణమ్మ ముందుగానే ఊహించి ఎంతో త్యాగం చేసి ఈ హైస్కూల్‌ను ఇక్కడ స్థాపించారన్నారు. నేటి తరం పుట్టినప్పటి నుండి టెక్నాలజీలో మునిగి తేలుతున్నారన్నారు. అయితే ఈ టెక్నాలజీని సద్వినియోగం చేసుకునే విషయంలో పిల్లలకు తల్లిదండ్రులు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. ఎలక్ట్రానిక్ విప్లవం, మాదక ద్రవ్యాలు రాబోయే తరానికి ప్రమాదకరంగా మారకూడదన్నదే లక్ష్యంగా పోలీస్ వ్యవస్థ పని చేస్తుందన్నారు. ఇంత మందిని ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఈ కార్యక్రమం చేశారంటే అది వీరవాసరం ఘనతగా తాను గర్వపడుతున్నానని తెలిపారు. వీరవాసరం నుంచి కేరళకు ఎవరు వచ్చినా తన అతిథులుగా భావిస్తానన్నారు. తుని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వీరవల్లి గోపాలకృష్ణ మాట్లాడుతూ భూదాన ఉద్యమంతో స్ఫూర్తి పొంది తన యావదాస్తిని విద్యా సంస్థల ఏర్పాటుకు దానం చేసిన మద్దాల రామకృష్ణమ్మను, జాతీయోద్యమ కవి, సంఘ సంస్కర్త, వీరవాసరం వాసి చిలకమర్తి లక్ష్మీనరసింహ పంతులును మర్చిపోకూడదన్నారు. కేంద్ర ప్రభుత్వ సైన్సు సలహాదారునిగా, రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్న సైన్స్ చక్రవర్తి సర్వేశ్వరశర్మ, చట్టసభలకు వెళ్లిన చేగొండి హరిరామజోగయ్య, బాడిగ రామకృష్ణ, పీతల సుజాత ఈ స్కూల్ విద్యార్థులే అని గుర్తు చేశారు. ఆలిండియా సర్వీస్‌లో ప్రస్తుతం రావాడ ఆజాద్ చంద్రశేఖర్‌తోపాటు తాడేపల్లి జేసుదానం, చిటికెన సత్యనారాయణ, ఎంవి.సుబ్బారెడ్డి, చికిలే సుభాకర్, చింత మధుసూదనరావు ఉన్నారని, దేశ, విదేశాల్లో ఎంఆర్‌కె పూర్వపు విద్యార్థులు అత్యున్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. వీరంతా హైస్కూల్ పేరు నిలబెడుతున్నారని తెలిపారు. ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ వీరుల వాసం వీరవాసరం అని కొనియాడారు. విద్యార్థులంతా ఆజాద్ చంద్రశేఖర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాజీ మంత్రి పీతల సుజాత మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగు స్తంభాలైన న్యాయం, పాలన, జర్నలిజం, చట్టం వీటిలో జర్నలిజం మినహా మూడు స్తంభాలు ఒకే వేదికపై ఉన్నాయన్నారు. ఇదే ఐక్యతతో గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం ఆజాద్ చంద్రశేఖర్, సరిత దంపతులను గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా విశిష్ట అతిథులు వీరవల్లి గోపాలకృష్ణ, పీతల సుజాత, మద్దాల సత్య పద్మను గ్రామస్తులు సత్కరించారు. డిజిపి ఆజాద్ చంద్రశేఖర్ చేతుల మీదుగా తన గురువులను సత్కరించారు. 2024–25 పదో తరగతి పరీక్షల్లో హైస్కూల్ టాపర్‌గా నిలిచిన బొక్కా దేవిశ్రీకి ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ రూ.పది వేలు బహుమతి, సెక్షన్లవారీగా 17 మందికి రూ.రెండు వేలు చొప్పున నగదు బహుమతి, పార్డ్ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

బాలికలు లక్ష్య సాధనకు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



విద్యార్థులతో జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భీమవరం తిరుమల కళాశాల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. చదువుకునే దశలో బాలికలు పౌష్టికాహారం తీసుకొని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. యుక్త వయసులో వచ్చే శారీరక, మానసిక మార్పుల వల్ల కలిగే ఆకర్షణలకు లోబడకూడదన్నారు. జిల్లాలో పాఠశాలలో చదివే బాలికల ఉత్తీర్ణతా శాతం బాలుర కంటే ముందు ఉందన్నారు. నేటి యువత సోషల్ మీడియాకు బానిస అవుతున్నారని, దానివల్ల చదువుపై ఏకాగ్రత తగ్గి చదువులో వెనుకబడుతున్నారని తెలిపారు. అందువల్ల సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని హితవు పలికారు. మహిళలు విద్యావంతులై ఉద్యోగాల్లో స్థిరపడి తమ కాళ్లపై తాము నిలబడే విధంగా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. బాలికలు శ్రద్ధగా చదువుకొని ఉద్యోగాల్లో స్థిరపడి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కాళ్ల మండలం మాలవానితిప్ప జెడ్‌పి హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని పి.రమాదేవి బాలికల వివక్షత, రక్షణ, చూపించాల్సిన చొరవ తదితర అంశాలపై అనర్గళంగా మాట్లాడి అబ్బురపర్చింది. విద్యార్థిని ప్రసంగానికి ముద్దులైన కలెక్టర్ దగ్గరకు తీసుకుని భుజం తట్టి ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ రమాదేవి ప్రసంగంలోని అంశాల నుండి స్ఫూర్తి పొందాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన బాలికలకు కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి.శ్రీలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, ఎపిసి పి.శ్యాంసుందర్, డిఎంహెచ్ఒ జి.గీతాబాయి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఆర్.రాజేష్, డిఐఇఒ జి.ప్రభాకర్‌రావు, తిరుమల కళాశాల డైరెక్టర్లు పి.శ్రీనివాస వర్మ, ఎస్.సాయిరాజు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై వైసిపి ధర్నా



సిఐకు వినతిపత్రం అందజేస్తున్న పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

అక్రమ నకిలీ మద్యం విక్రయించడానికి ప్రభుత్వం బెల్ట్ షాపులను అనుమతిస్తోందని, ఇది ఎంత మాత్రమూ తగదని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. నకిలీ మద్యం విక్రయాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కల్తీ మద్యం విక్రయాలను నిరసిస్తూ బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైసిపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసింహరాజు నాయకత్వం వహించి మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మద్దతుతోనే అక్రమ మద్యం విక్రయదారులు ఉన్నారనీ, ఇప్పుడు అదే ప్రభుత్వం ఆధ్వర్యంలో విచారణ ఎంతవరకూ న్యాయంగా జరుగుతుందని ప్రశ్నించారు. ఈ అక్రమ మద్యంపై విచారణకు సిట్టింగ్ న్యాయమూర్తి చేత విచారణ జరిపించాలని కోరారు. అనంతరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు అంబటి రమేష్, పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుండా సుందర రామనాయుడు, నాయకులు మన్నే పోతురాజు, జిక్కి, సంబర్లిన్, ఎండి అహ్మద్, ఎమ్‌డి అహ్మద్, శ్రీనివాసరెడ్డి, గేదెల అప్పారావు, జగదీష్ పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని ఏం చేస్తారో చెప్పాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం



మాట్లాడుతున్న బలరాం

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్రానికి వచ్చే ప్రధాని మోడీ రాష్ట్రాభివృద్ధికి ఏం చేస్తారో చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం మాట్లాడుతూ ట్రంప్ విధించిన సుంకాల వల్ల మన దేశంలో రైతాంగం తీవ్రంగా నష్టపోతోందన్నారు. రాష్ట్రంలో ఆక్వా, వరి సాగుపై ఈ ప్రభావం చూపుతోందన్నారు. ప్రధానంగా గోదావరి జిల్లాల్లో ఆక్వా, వ్యవసాయ రైతులకు నష్టం వాటిల్లుతోందన్నారు. ఆక్వా రంగం, వ్యవసాయ రంగాలను ఆదుకోవాలన్నారు. జిఎస్‌టి తగ్గించడాన్ని ప్రచారం చేసుకోవడానికి మోడీ రాష్ట్రానికి వస్తున్నారని, తగ్గింపు వల్ల రాష్ట్రానికి రూ.8 వేల కోట్లు నష్టమని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెపుతున్నారని గుర్తుచేశారు. రాష్ట్రానికి ప్రధాని మోడీ ఎప్పుడు వచ్చినా ఒట్టి చేతులతోనే వస్తున్నారని, ఈ సారైనా రాష్ట్ర అభివృద్ధికి సహాయం చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. ఈ పర్యటనలో అయినా రాష్ట్రాభివృద్ధికి నిధుల కేటాయింపుపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ అమ్మకాన్ని ఆపుతామని, కడప ఉక్కును ప్రారంభిస్తామని హామీ ఇస్తారా అని ప్రశ్నించారు. విభజన హామీలు అమలు, రాజధాని నిర్మాణానికి నిధులు, పోలవరం నిర్మాణం, నిర్వాసితుల పునరావాసం ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, ధాన్యం బకాయిలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళలకు, 18 ఏళ్లు నిండిన వారికి 18,500 ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. తక్షణం ఆసుపత్రులకు బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ఎంఎల్‌ఎ రఘురామ కృష్ణంరాజుకు ఇళ్లు తొలగించడంలో ఉన్న ఆత్రుత ప్రత్యామ్నాయం చూపడంలో ఉండడం లేదన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో యుద్ధ ప్రాతిపదికన పేదల ఇళ్లు కూల్చిన వారందరికీ ప్రత్యామ్నాయం చూపడంలో విఫలమయ్యారన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, దూసి కళ్యాణి, ఎ.అజయకుమారి, గొర్ల రామకృష్ణ, కె.క్రాంతిబాబు, కామన మునిస్వామి, ఇంజేటి శ్రీనివాస్, ఆకివీడు పట్టణ కార్యదర్శి తవిటి నాయుడు పాల్గొన్నారు.

పని గంటల విధానానికి తూట్లు




మాట్లాడుతున్న త్రిమూర్తులు

ప్రజాశక్తి - నరసాపురం

బ్రిటీష్ ప్రభుత్వంతో కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానానికి తూట్లు పొడుస్తూ, కార్మిక, ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని సిఐటియు డిమాండ్ చేసింది. స్థానిక మీరా భవన్‌లో సిఐటియు పట్టణ ఎనిమిదో మహాసభ జరిగింది. ఈ మహాసభకు సిఐటియు నాయకులు నోముల కొండ, ఎమ్‌డి బేగం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దేశంలో ఉన్న శ్రామిక కార్మిక ఉద్యోగ వర్గాల హక్కులను కాలరాస్తూ బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానానికి తూట్లు పొడుస్తూ కార్మిక ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. దేశంలో, రాష్ట్రంలో కార్మిక, ఉద్యోగ హక్కులు పరిరక్షించి కార్మిక చట్టాలను అమలుపర్చి వారి సంక్షేమాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలు, వారికున్న హక్కులను హరించే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. బడా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా, ఈ దేశంలో కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసే విధానాలను వేగవంతం చేస్తూ, చట్టసభల్లో బిల్లులు పాస్ చేయడంలో ఈ ప్రభుత్వాలు కంకణం కట్టుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రతి కార్మికునికీ రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని చెబుతున్నా, వాటిని అమలు చేయకుండా, కార్మికులు, ఉద్యోగులపై పని భారం పెంచే విధంగా 10 గంటల పని విధానాన్ని ఏ విధంగా తీసుకొస్తున్నారని ప్రశ్నించారు. కార్మికులకు, ఉద్యోగులకు పని భారం తగ్గించి, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మహాసభలో కార్యకలాపాల రిపోర్టును ప్రవేశపెట్టి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన సిఐటియు పట్టణ కన్వీనర్ కోడె లక్ష్మణ్, కో కన్వీనర్ ఎమ్‌డి బేగం, నోములకొండతో పాటు 18 మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ సరికాదు

డిసిసిబి మాజీ చైర్మన్ పివిఎల్ నరసింహరాజు



సంతకాల సేకరణలో పాల్గొన్న నరసింహరాజు

ప్రజాశక్తి - ఉండి

మాజీ సిఎం జగన్ పాలనలో వేల కోట్ల ప్రజల ఆస్తులతో 17 మెడికల్ కాలేజీలు తీసుకురాగా అందులో నాలుగు కాలేజీలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని, అటువంటి మెడికల్ కాలేజీల వేల కోట్ల ఆస్తులను కాసులకు కక్కుర్తిపడి కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయడం తగదని, పేదలకు మెడికల్ కాలేజీలు అందుబాటులోకి తేవాలని డిసిసిబి మాజీ ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు తెలిపారు. బుధవారం వైసిపి మండల అధ్యక్షులు పివిఆర్ కె.ఆంజనేయరాజు ఆధ్వర్యంలో మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, చిట్టూరి రత్నరాజు ఇంటి వద్ద మెడికల్ కాలేజీలో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పివిఎల్ నరసింహారావు పాల్గొని మాట్లాడారు. 2019 వరకూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలో మూడు మెడికల్ కాలేజీలు ఉన్నాయని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్తగా 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చి కోట్లాది రూపాయల ఖర్చుతో కూడుకున్న మెడికల్ విద్యను అతి తక్కువ ఖర్చుతో నిరుపేద ప్రతిభావంతులైన విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో వేల కోట్ల రూపాయలతో స్థలాన్ని సేకరించి నిధులను కేటాయించి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ప్రతిపాదించగా అందులో కొన్ని నిర్మాణం పూర్తి చేసుకుని మిగిలినవి నిర్మాణ దశలో ఉండగా అటువంటి మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేసి లబ్ధి పొందాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి చేస్తున్న పోరాటానికి ప్రజలందరూ మద్దతు పలికి గవర్నర్‌కు అందజేసే వినతిపత్రంపై సంతకాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జున, సీనియర్ నాయకులు గులిపల్లి అచ్చారావు, రణస్థల మహంకాళి, బడుగు బాలాజీ, అడబాల నాని, గిరడా శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలకు వేళాయే

జెవివి ఆధ్వర్యంలో 35 ఏళ్లుగా సంబరాల నిర్వహణ

సైన్స్ సంబరాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి : జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిఇఒ, జెవివి నేతలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో చెకుముకి సైన్స్ సంబరాలకు వేళైంది. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా సైన్స్ సంబరాలు అంబరాన్ని అంటే విధంగా నిర్వహణ జరుగుతుంది. గత 35 ఏళ్లుగా ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించడానికి చెకుముకి సైన్స్ సంబరాలు ఎంతో దోహదపడుతున్నాయి. దీనిలో భాగంగా స్థానిక కలెక్టరేట్లో చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికను జిల్లా విద్యాశాఖ అధికారి ఇవివిఎన్ఎస్ ఎస్ఎస్‌బిఎల్.నారాయణ ఆవిష్కరించి మాట్లాడారు. చెకుముకి సైన్స్ సంబరాలు విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన, ప్రశ్నించే తత్వం శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తుందన్నారు. ఉపాధ్యాయులందరూ ఎక్కువ మంది విద్యార్థులు సైన్స్ సంబరాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్న బాబు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలు ఈ నెల 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, 23న జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. 8, 9, 10వ తరగతి చదివే ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు దీనిలో పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ, డిసిఇబి సెక్రటరీ జివివి.శ్రీనివాస్, కుమారస్వామి, జెవివి గౌరవ సలహాదారు ప్రత్తి వీరాస్వామి, జెవివి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జామాను రామలక్ష్మణరావు, మల్లుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చింతపల్లి ప్రసాదరావు, వై.అజయ్‌కుమార్, కె.రాయపరాజు, జి.సుకుమార్, పి.ఫణిరాజేష్, అలుగు జాన్సన్, వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిశ్రమల అభివృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణ ముఖ్యం

కలెక్టర్ చదలవాడ నాగరాణి



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పరిశ్రమల అభివృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణ కూడా ముఖ్యమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎపిఐఐసి ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. పరిశ్రమల వృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమానంగా ముందుకు సాగాలని, ఇందులో భాగంగా జిల్లా పరిధిలో పరిశ్రమల ఆధునికీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధి, శుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే దిశగా ఎపిఐఐసి ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్‌ను నవంబర్ 15వ తేదీ వరకూ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరిశ్రమల మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, స్థిరమైన అభివృద్ధి చర్యలు, పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహ కార్యక్రమాలు, శుభ్రత, పారిశుధ్య డ్రైవ్, మొక్కల నాటే కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా పరిశ్రమల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, శుభ్రమైన పారిశ్రామిక వాడలు స్థాపన, పెట్టుబడిదారుల సహకారం ద్వారా పరిశ్రమల వృద్ధే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి విజయవాడ జోనల్ మేనేజర్, ఐలా సిబ్బంది, ఇండస్ట్రియల్ పార్క్ ఎంటర్‌ప్రైజర్లు పాల్గొన్నారు.

జిఎస్‌టి సభకు 400 మంది తరలింపు : జెసి

ప్రజాశక్తి - భీమవరం

సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ ప్రధాని విజయోత్సవ సభకు భీమవరం నుంచి 400 మంది కర్నూల్‌కు బుధవారం రాత్రి బయలుదేరి వెళ్లారు. ఈ బస్సుకు జెండా ఊపి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ప్రధాని విజయోత్సవ సభకు వెళ్లే ప్రముఖులకు అభినందనలు తెలిపారు. కర్నూలులో జరిగే సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ విజయోత్సవ సభకు భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు నుండి 400 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. వీరందరికీ తాగునీరు, అల్పాహారం, భోజన వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కర్నూలు ప్రధానమంత్రి సభకు హాజరై తిరిగి వచ్చేవరకు ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకునేందుకు ఒక లైజన్ అధికారిని బస్సులో వెళ్లిన వారితో పంపటం జరిగిందని అన్నారు. అలాగే ఎప్పటికప్పుడు వీరి సమాచారం తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించిన ఒక సీనియర్ ఉద్యోగిని నియమించటం జరిగిందని తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కెపి.శైలజ, ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా జిఎస్‌టి అధికారి కేథేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎ.రాంబాబు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులకండ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

తడి, పొడిచెత్తపై ప్రతిఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని డిపిఆర్‌ఒ ఎన్.రామ్‌నాథ్ రెడ్డి అన్నారు. బుధవారం సరిపల్లిలో గల చెత్త సంపద తయారు కేంద్రంలో జరిగిన సిబ్బందికి శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గణపవరం, ఉండి మండలాల నుండి హాజరైన సిబ్బందికి ఆయన చెత్తసంపదపై అవగాహన కల్పించారు. మండలాల్లో ప్రతి వెయ్యి మందికి ఒక ట్రైనర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వారికి రూ.5 వేలు గౌరవ వేతనం అందజేస్తామన్నారు. ట్రైనర్ స్థానికులకు తడిచెత్త, పొడి చెత్త సంపదపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి మాట్లాడుతూ పారిశుధ్య నిర్వణపై పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న వారు గ్రామాల్లో తడిచెత్త, పొడిచెత్తతో సంపద తయారీపై కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సరిపల్లి సర్పంచి చనుమూరి లక్ష్మీ భవాని, కార్యదర్శి డి.రామాంజనేయులు, గణపవరం, ఉండి మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

స్వాములకు అన్నదానం

ప్రజాశక్తి - నరసాపురం


అన్నదానం చేస్తున్న కొవ్వలి

పట్టణంలోని ఏడవ వార్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం మధ్యాహ్నం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భిక్షను ప్రారంభించి స్వయంగా స్వాములకు రామ్మోహన్ నాయుడు వడ్డించారు. కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, కొవ్వలి ఫాలోవర్స్ పాల్గొన్నారు.

డిఎస్‌సిలో ఇరువురు ఉపాధ్యాయులకు కొలువులు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఇటీవల నిర్వహించిన మెగా డిఎస్‌సిలో శ్రీదాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థినులు కోట సుబ్బలక్ష్మి వ్యాయామ ఉపాధ్యాయురాలిగా నరసాపురం జెడ్‌పిహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో పోస్టింగ్ లభించింది. నిల్లా వాసంతి నిడమర్రు మండలం, వి.పురం ఎంపిపి పాఠశాలలో ఎస్‌జిటిగా ఉద్యోగ నియామకాలు పొందారు. కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో వీరిని అభినందిస్తూ వీరు ఉద్యోగరీత్యా మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

వేమవరం వైసిపి గ్రామాధ్యక్షులుగా రామకృష్ణ

ప్రజాశక్తి - ఆచంట

వైసిపిని బలోపేతం చేసేందుకు మండలంలో అన్ని గ్రామాల్లోనూ గ్రామ కమిటీ అధ్యక్షులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు జక్కంశెట్టి చంటి అన్నారు. బుధవారం వైసిపి ఆచంట వేమవరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా ఎడ్ల రామకృష్ణ ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వేమవరంలో నూతనంగా ఎంపికైన వైసిపి గ్రామ కమిటీతో పాటు యూత్ అధ్యక్షులు దొంగ ఉపేంద్ర, రైతు విభాగం అధ్యక్షులు గుత్తుల బులి స్వామి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు కొండేటి జోగేంద్ర, బిసి సెల్ అధ్యక్షులు గెద్దాడ హరిబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు కొవ్వుల దేవిని నిమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుంకర సీతారామ్, ఉపసర్పంచి కొండేటి సురేష్, అరుమిల్లి రామచంద్ర రావు, గుత్తుల శ్రీను, విశ్వనాథుల సత్యనారాయణ, బళ్లారి నాగరాజు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టాలి

డిప్యూటీ తహశీల్దార్ ఎలియమ్మ

ప్రజాశక్తి - పెనుమంట్ర

బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యతని, ఇందుకు అందరూ తమ వంతు సహాయం అందించాలని మండల డిప్యూటీ తహశీల్దార్ ఎలియమ్మ అన్నారు. బుధవారం సాయంత్రం పెనుమంట్ర జెడ్‌పి హైస్కూల్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జరిగిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సులో మండలంలోని 6 నుంచి 10వ తరగతి బాలికలకు బాలల హక్కులు, బాలికలపై జరిగే లైంగిక వేధింపులను ఎలా నివారించాలి, బాల్య వివాహాలు జరగడానికి కారణాలు గురించి పాల్గొన్న వక్తలు వివరించారు. బాల్య వివాహాలు, వాటి వల్ల కలిగే దుష్ఫలితాలు, వాటిని ఏ విధంగా నివారించవచ్చని మీరు భావిస్తున్నారు అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు ఈ సందర్భంగా బహుమతులు అందించారు. ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయులు డౌట్స్, సజెషన్స్ బాక్స్ ఏర్పాటు చేసి, బాలికల సందేహాలకు వెంటనే వారి సూచనలను అందించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఎ.కృష్ణకుమారి, గ్రామ సర్పంచి టి.ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని లింగం శారద, అంగన్వాడీ సూపర్వైజర్లు పి.వరలక్ష్మి, ఎస్.వెంకట లక్ష్మి, స్కూల్ టీచర్లు, అంగన్వాడీ టీచర్లు, బాలికలు పాల్గొన్నారు.

గూగుల్‌తో ఒప్పందం చారిత్రాత్మకం

టిడిపి నాయకులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గూగుల్‌తో ఎపి ప్రభుత్వం ఒప్పందం చరిత్రాత్మకమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. రాష్ట్రంలో నవశకం మొదలైందని, ఎపిలో ఎఐ డేటా సెంటర్ రావడం నిరుద్యోగ యువతకు అదృష్టమని, ఇది యువనేత మంత్రి లోకేష్ అంకుచిత దీక్షకు నిదర్శనమన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ ప్రాజెక్టు వల్ల అనేక వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగాను ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు.

మొగల్తూరు : విశాఖపట్నంలో రూ.87,500 కోట్లతో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు భూమి పూజ చేయడం శుభ సూచకమని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మండలంలోని పేరుపాలెంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మారనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తినేని బాబ్జీ, సర్వేశ్వరరావు, నాగిడి రాంబాబు, జోగి రాధాకృష్ణ, సత్తినేని త్రిమూర్తులు, చల్లా సుబ్రమణ్యం పాల్గొన్నారు.

భీమవరం బెనిఫిట్ బజారుపై విస్తృత ప్రచారం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆచంట

జిఎస్‌టిపై గ్రామాల్లో ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేయాలని ఎంపిడిఒ బిఎస్ఎస్.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ భీమవరం జువ్వల పాలెం రోడ్ లో ఏర్పాటు చేసిన సూపర్ జిఎస్‌టి బెనిఫిట్ బజారులో డిస్కౌంట్‌పై అనేక వస్తువులను విక్రయిస్తున్నారని, ఈ విషయంపై గ్రామాల్లో ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.బులి సూరన్న, కార్యదర్శులు చంద్రశేఖర్, దుర్గా ప్రసాద్, గణేష్, ఫణి, వెంకటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ, తయారీదారులు నిబంధనలు పాటించాలి

- లేకుంటే చట్టపరమైన చర్యలు
- టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి
- అగ్నిమాపక భద్రతా నియమాలు తప్పనిసరి
- ఫైర్ ఆఫీసర్ కె.భాస్కర్ రామమ్

ప్రజాశక్తి - నరసాపురం



బాణసంచా విక్రయ దుకాణాలు, తయారీదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నరసాపురం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె.భాస్కర్ రామమ్ హెచ్చరించారు. షాపు యజమానులకు, సిబ్బందికి అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే డెమో చేసి వివరించామన్నారు. అగ్నిప్రమాదాల నివారణలో ప్రజలందరూ అవగాహన పెంపొందించుకొని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అగ్నిప్రమాదాల నివారణ ప్రజలందరి బాధ్యతని తెలిపారు. అనధికారికంగా బాణసంచా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనధికారికంగా బాణసంచా విక్రయించినా 9963726487, 101 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. దీపావళి పండుగ నేపథ్యంలో ప్రజాశక్తి ఆయనను పలకరించగా పలు విషయాలు వెల్లడించారు.

చిట్ - చాట్

ప్రశ్న : మీ పరిధిలో ఏ మండలాలు ఉన్నాయి?

జవాబు : నరసాపురం పట్టణం, మండలం, మొగల్తూరు.

ప్రశ్న : మీ పరిధిలో బాణసంచా తయారీ కేంద్రాలు(ఎల్ఇ-1) ఉన్నాయా?

జవాబు : నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలో రెండు తయారీ కేంద్రాలు ఉండేవి. వాటికి అనుమతి లేదు. ఇప్పటికే ఆ తయారీ కేంద్రాలు సీజ్ చేశాము.

ప్రశ్న : మీ పరిధిలో బాణసంచా విక్రయ కేంద్రాలు(ఎల్ఇ-5) ఉన్నాయా?

జవాబు : నరసాపురం మండలం చిట్టవరం, నరసాపురంలో 3 బాణసంచా దుకాణాలు, మొగల్తూరులో ఒక షాపు ఉన్నాయి.

ప్రశ్న : ఈ ఏడాది తాత్కాలిక దీపావళి బాణసంచా దుకాణాలుకు ఎన్ని షాపులకు అనుమతినిచ్చారు?

జవాబు : ఈ ఏడాది దీపావళి బాణసంచా దుకాణాలకు అనుమతి ఇవ్వలేదు. ఉన్నతాధికారుల నుండి ఇంకా మార్గదర్శకాలు వెలువడలేదు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించి, దరఖాస్తులు పరిశీలించి అనుమతులు అందజేస్తాము.

ప్రశ్న : గత ఏడాది ఎన్ని తాత్కాలిక బాణసంచా దుకాణాలకు అనుమతి ఇచ్చారు?

జవాబు : గత ఏడాది ప్రభుత్వ నిబంధనల మేరకు 50 షాపులకు అనుమతి ఇచ్చాము.

ప్రశ్న : దీపావళి పండుగ నేపథ్యంలో తనిఖీలు చేపడుతున్నారా?

జవాబు : ఇటీవల కోనసీమ జిల్లాలో జరిగిన ప్రమాదంతో ఇప్పటికే నిత్యం షాపులలో తనిఖీలు చేపడుతున్నాము. రెవెన్యూ, పోలీస్, ఫైర్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపడుతున్నాము.

ప్రశ్న : ప్రజలకు మీరిచ్చే సూచన ఏమిటి?

జవాబు : దీపావళి బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్త వహించాలి. ఎటువంటి ప్రమాదం జరగకుండా చూసుకుని పండుగ సంతోషంగా జరుపుకోవాలి.

రైతులు వ్యవసాయ రంగంలో సృష్టికర్తలు

వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర



పెనుమంట్రలో గ్రామీణ పఠాని చూపుతున్న విద్యార్థులు

రైతులు వ్యవసాయ రంగంలో గొప్ప సృష్టికర్తలని, వారి వ్యవసాయ అనుభవాన్ని పంచినప్పుడే విద్యార్థులకి వ్యవసాయం మీద అవగాహన ఏర్పడుతుందని వ్యవసాయ కళాశాల(రాజమహేంద్రవరం) ప్రిన్సిపల్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మల్లిపూడి గ్రామంలో గ్రామీణ రావ్ కార్యక్రమం కింద బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు 4వ సంవత్సరం విద్యార్థులు వివిధ గ్రామీణ భాగస్వామ్య విశ్లేషాత్మక తులనం కార్యక్రమం కింద సామాజిక పటంతో పాటు వివిధ పటాలను తయారు చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా కళాశాల నుండి ప్రిన్సిపల్ డాక్టర్ డి.శ్రీనివాస్‌తో పాటు, ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.శ్రీనివాసరావు, కృషివిజ్ఞాన కేంద్రం కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ ఇంటర్న్‌షిప్‌లో కళాశాల విద్యార్థులు దర్శి జోయల్ అభినవ్, కె.సంతోష్‌రావు, సిహెచ్.యోగేష్, పి.యోగేశ్వర్ రావు, గ్రామస్తులు, రైతులు గ్రామీణ పఠాన్ని తిలకించి, సూచనలు, సలహాలు చేశారు.

ఆచంట : గ్రామ విస్తీర్ణం, భూగోళిక పరిస్థితులు, భూసార స్థితిగతులను గ్రామస్తులు, రైతులు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాజమండ్రి వ్యవసాయ కళాశాల అసోసియేటెడ్ డిన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొడమంచిలి గ్రామంలో రాజమండ్రి వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, భూసార స్థితిగతులపై గ్రామస్తులకు, రైతులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకి గ్రామ భౌగోళిక పరిస్థితులు, వ్యవసాయ విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి సమాచారం సేకరించడం ద్వారా రైతులకు తగిన సూచనలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంవి.కృష్ణాజీ, డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, డాక్టర్ హెచ్.శ్రీనివాస్, డాక్టర్ ఆనంద్ పాల్గొన్నారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు కె.సాక్షర, డి.మోనిక, జి.మౌనిక, బి.వైష్ణవి, పి.యశ్విత ఈ ప్రదర్శన నిర్వహించారు.

ఘనంగా ఎపిజె అబ్దుల్ కలాం జయంతి

ప్రజాశక్తి - పాలకొల్లు


పాలకొల్లు నివాళులర్పిస్తున్న మాంటిస్సోరి విద్యార్థులు


తాడేపల్లిగూడెంలో..

భారతరత్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జయంతిని స్థానిక పాలకొల్లు మాంటిసోరి స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో ఉన్న అబ్దుల్ కలాం పార్కును సందర్శించి, వారి విగ్రహానికి పుష్పమాలాంకృతులను చేసి కలాం దేశానికి అందించిన సేవలను కొనియాడారు. విద్యాసంస్థల డైరెక్టర్ కెవి.కృష్ణ వర్మ మాట్లాడుతూ అబ్దుల్ కలాం పేదరికంలో పుట్టినా తనకున్న కృషి, పట్టుదలతో ఉన్నత విద్యావంతుడై డిఆర్‌డిఒలో శాస్త్రవేత్తగా సమున్నతమైన సేవలందించి, భారత అంతరిక్ష పరిశోధనా ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పారన్నారు. తదనంతరం రాష్ట్రపతిగా సేవలందిస్తూ ఎందరో రాజకీయ నాయకులు ఆదర్శంగా నిలవడం, పదవీవిరమణ చేశారన్నారు. కలలు కనండి వాటిని సహకారం చేసుకోవడానికి ప్రయత్నించండి అని చెప్తూ నేటి యువతరాన్ని ఉత్తేజపరిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మరో డైరెక్టర్ చిలుకూరి కుమార్, స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపవరం : ప్రపంచ మేధావి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు బుదవారం స్థానిక ఎంపిపి పాఠశాలలో ఘణంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మానవత జిల్లా సహాయకార్యదర్శి కాకర్ల వినాయక మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘణంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మానవత నాయకులు సీతయ్య, గంటా అన్నవరం, విశ్రాంతి ఇంగ్లీషు ఉపాధ్యాయులు పల్లా నరశింహామూర్తి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

తాడేపల్లిగూడెం : క్షిపణి సాంకేతికత అభివృద్ధిలో అబ్దుల్ కలాం కీలక పాత్ర పోషించారని, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందారని డైమండ్స్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు తెలిపారు. మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం జయంతిని బుధవారం స్థానిక గరల్స్ హైస్కూల్‌లో పేరిచర్ల ఫౌండేషన్ సహకారంతో లయన్ ఇంద్రవాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ అబ్దుల్ కలాం భారతదేశపు మొట్టమొదటి ఉపగ్రహవాహన ప్రయోగంలో ముఖ్యమైన సహకారం అందించారని, తన పదవీ విరమణ తర్వాత, ఆయన బోధన, రచనలు, విద్యార్థులకు స్ఫూర్తినివ్వడంపై దృష్టి సారించారన్నారు. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌లో శాస్త్రవేత్తగా తన కెరీర్ ప్రారంభించారన్నారు. లయన్ ఇంద్రవాణి మాట్లాడుతూ వింగ్స్ ఆఫ్ ఫైర్ వంటి అనేక పుస్తకాలు రాశారని, అయన చరిత్ర విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా విద్యార్థులకు శుభ్రత తెలియచేస్తూ చేతులు ఎలా శుభ్రపరచాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి, కె.రామకృష్ణ, కె.రత్నకుమారి శశికళ, కె.కృష్ణంరాజు, కారుణ్య సరస్వతి, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మిస్సైల్ మాన్‌గా పేరుపొందిన మహోన్నత వ్యక్తి ఎపిజె అబ్దుల్ కలాం అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్మత్స రామరాజు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆరోగ్య వర్ధిని ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడారు. అబ్దుల్ కలాం పుట్టినరోజును ప్రపంచ విద్యార్థుల దినంగా ప్రకటించడం హర్షనీయమని, ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాం ఆదర్శంగా తీసుకుని దేశ అభ్యున్నతికి పాటుపడే స్థాయికి ఎదగాలని అన్నారు. అనంతరం అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాలలో ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు, దొంగ శ్రీనివాసు, రాజకుమార్ రెడ్డి, సత్యవాణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో 2025 విద్యాసంవత్సరంలో ర్యాంకులు సాధించిన శీరీష్, పావని, శ్రావణిలకు నగదు ప్రోత్సాహకాలు ఎన్ఆర్ఐ విష్ణుబట్ల రామన్న, లక్ష్మన్నలు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కాలేజీలో జరిగిన సమావేశానికి ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి వనరులను ఉపయోగించుకొని ఉత్తమ విద్యార్థులుగా తయారు కావాలని అన్నారు. విద్యార్థుల అభివృద్ధికి చేయూతనిస్తున్న రామన్న లక్ష్మన్నలకు కృతజ్ఞతలు తెలిపారు. దేశం విడిచి వెళ్లిపోయినా పుట్టిన గడ్డపై మమకారంతో సొంత ఊరి విద్యార్థుల అభివృద్ధికి ప్రతి ఏటా తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. మొదటి ర్యాంకు సాధించిన శీరీషకు రూ.40 వేలు, రెండవ ర్యాంకు సాధించిన పావనికి రూ.20 వేలు, మూడవ ర్యాంకు సాధించిన శ్రావణికి రూ.10 వేలు రామన్న లక్ష్మన్నలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామన్న లక్ష్మన్న స్నేహితులు, సిబ్బంది పాల్గొన్నారు.

22న సైన్స్ ఎగ్జిబిషన్

భీమవరం టౌన్ : ఈనెల 22వ తేదీన భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో డిస్ట్రిక్ట్ యూత్ ఫెస్టివల్ సందర్భంగా జిల్లాస్థాయి ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళా, సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, సెట్వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకర్ రావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజ్మెంట్ మీటింగ్ హాల్లో ఇందుకు సంబంధించిన పోస్టర్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపార్ట్మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ సెట్వెల్, ఇన్ కోఆర్డినేషన్ ఆఫ్ ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ ఎం.సురేష్ బాబు మాట్లాడుతూ జిల్లాకు చెందిన యూత్ ఇన్నోవేటివ్ ప్రాజెక్టులను ఇక్కడ ప్రదర్శించడానికి ఎంతో అవకాశం ఉందన్నారు. 22వ తేదీన జరిగే సైన్స్ ఎగ్జిబిషన్లో మొదటి, రెండవ బహుమతులు పొందిన ప్రాజెక్టులను అమరావతిలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఎగ్జిబిషన్ సైన్స్ మేళాలో పాల్గొనే టీంలు ముందుగా ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఎఐసిటిఇ ఐడియా ల్యాబ్‌లో నమోదు చేయించుకోవాలని, ఒక్కొక్క ప్రాజెక్టుకు ఐదు మందికి మాత్రమే అనుమతని పేర్కొన్నారు. కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్.దిలీప్ చక్రవర్తి పాల్గొన్నారు.

పలుచోట్ల 'పోషణ్ మహా'

ప్రజాశక్తి - యలమంచిలి


చించినాడలో..

మండలంలోని చించినాడ గ్రామంలో బుధవారం పోషణ్ మహా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికంగా దొరికే ఆహార ఉత్పత్తులపై అవగాహన కల్పించడంతోపాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహార వంటకాలపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్‌వైజర్ ఎంఎన్.పద్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, చేతులను శుభ్రపరచుకొనే ఏడురకాల విధానాలను అందరికీ వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీలు బి.రజని, కె.భారతి, ఎన్.సుజాత, జి.సత్య జ్యోతి పాల్గొన్నారు.

ఆచంట : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత అలవాటు చేసుకుంటే ఆరోగ్యం చేకూరుతుందని సచివాలయ మహిళా పోలీస్ రేనా లోయస్ అన్నారు. పోషణ్ మహా కార్యక్రమం సందర్భంగా ఆచంట వేమవరం అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, తల్లులకు చేతులు ఏవిధంగా శుభ్రం చేసుకోవాలనే విషయంపై ఏడు రకాలుగా శుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యవంతమైన జీవనం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం శాంతకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ప్రీ స్కూల్ విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.


నాణ్యమైన విద్యావ్యాప్తికి ప్రభుత్వం కృషి

డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - నరసాపురం


విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న రాజ్యలక్ష్మి

కూటమి ప్రభుత్వం నాణ్యమైన విద్యావ్యాప్తి చేయాలన్న సంకల్పంతో యువత జీవితాల్లో వెలుగులు నింపి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయడానికి జిఎస్‌టి 2.0 సంస్కరణలతో విద్యారంగం, స్టేషనరీ వస్తువులపై భారీగా పన్ను తగ్గించడం జరిగిందని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నరసాపురం మండలం కాపుల కొడప గ్రామం జెడ్‌పిహెచ్ స్కూల్‌లో విద్యార్థులకు జిఎస్‌టి 2.0పై అవగాహన కల్పించేందుకు వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మి శిరిగినీడి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల పాలిట వరమైందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన సంస్కరణగా జిఎస్‌టి 2.0ను తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఈ సహకారంతో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు బండి స్వర్ణలత, ఉపాధ్యక్షురాలు పుష్పాల ఉషాకమల, గంటా వెంకటరమణ, సుంకర రాజకుమారి, ప్రధానోపాధ్యాయులు వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఉత్సవంలో పాల్గొన్న కొవ్వలి రామ్మోహన్ నాయుడు

పుంతలో ముసలమ్మ ఆలయంలో కొవ్వలి

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 7వ వార్డులో వేంచేసియున్న శ్రీపుంతలో ముసలమ్మ అమ్మవారి దసరా మహోత్సవాలు ముగింపుకు చేరుకున్నాయి. బుధవారం జరిగిన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గరగల నృత్యము, పులి డాన్సులతో, కాళికామాత నృత్యం, బుట్ట బొమ్మలతో అతి వైభవంగా జరిగిన అమ్మవారి ఉత్సవ ఊరేగింపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన టౌన్ ప్రెసిడెంట్ కోటిపల్లి వెంకటేశ్వరరావు, సంకు భాస్కర్ నాయుడు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోటిపల్లి రాంబాబు, గుగ్గిలపు బుజ్జి, చినిమిల్లి త్రిమూర్తులు, గంటా సత్యనారాయణ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు 12వ వార్డులో నివసిస్తున్న కర్రల భానుమూర్తి మరణించడంతో వారి కుటుంబానికి పొట్నూరి ఫౌండేషన్ ఛైర్మన్ పొట్నూరి అప్పన్న(మాజీ వార్డు కౌన్సిలర్) 50 కేజీల బియ్యం, 5 కేజీల ఉల్లిపాయలు, 3 కేజీల కందిపప్పు, 3 ఆయిల్ పాకెట్స్ అందించారు. అతని భార్య సత్యవతి, కూతురు గాయత్రి శారీరక, మానసిక వికలాంగురాలు, కొడుకు మణికంఠ పోలియో వ్యాధితో బాధపడుతున్నారు. వారి ఆర్థిక పరిస్థితిని చూసి వారికి ఇంకా కొన్ని నిత్యావసర వస్తువులు ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు చేయూతనిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు నకిలీ మద్యంపై ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం

నకిలీ మద్యం విక్రయాలపై ఈనెల 16వ తేదీన నరసాపురం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాద్‌రాజు తెలిపారు. నకిలీ మద్యంపై వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ మోహన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలుతగా మేదర్ల వంతెన వద్ద పార్టీ కార్యాలయం నుండి రాయపేటలోని ఎక్సైజ్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం ఎక్సైజ్ స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో పురోహితుడు మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

నేరాలు - ఘోరాలు

ఎక్సెల్ మోటార్ సైకిల్ వాహనంపై వెళుతున్న పురోహితుడును బుధవారం లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన స్థానికంగా చోటుచేసుకుంది. పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన శివకోటి అప్పారావు(60)గా గుర్తించారు. పాలకొల్లు పెద్ద గోపురంలో పురోహితుడుగా పని చేస్తున్నట్లు సమాచారం. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.